పార్టీని మరవని వారిని పార్టీ మరవదు



సభ్యత్వం అందజేస్తున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి

మేడ్చల్: అధికారంలో ఉన్నా లేకున్నా, పదవులు ఉన్నా లేకున్నా, పార్టీని మరువని నాయకులను, కార్యకర్తలను బీజేపీ ఏనాడు మరవదని జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. మేడ్చల్‌లో ఆయన గురువారం పార్టీ సభ్యులకు క్రియాశీలక సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం నిరంతరం పని చేసే నాయకులను, కార్యకర్తలను పార్టీ గుండెల్లో పెట్టుకుంటుందన్నారు. పార్టీ పటిష్టతకు, ప్రజల మేలు కొరకు కార్యకర్తలు నిరంతరం పని చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, జగన్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, నాయకులు వంశీధర్‌రెడ్డి, ఈశ్వర్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌గుప్తా తదితరులు

ఘట్‌కేసర్: పట్టణంలోని రైల్వే వంతెన పనుల ఆలస్యానికి నిరసనగా గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేష్‌గుప్త, జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్త, కోశాధికారి విశ్వనాథంగుప్త, మున్సిపల్ అధ్యక్షుడు శరత్‌బాబుగుప్త, వెంకటేష్‌గుప్త తదితరులు దీక్షలు చేపట్టగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌గుప్తా, రామోజీ, శ్రీనివాస్‌గౌడ్ సంఘీభావం తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన కమిషనర్

ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రాథమిక పాఠశాల, ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను బోధనపై వివరాలు తెలుసుకొని వారితో కలిసి భోజనం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీను, రాజేష్, హెచ్‌ఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడి ప్రతిష్ఠ



ప్రతిష్ఠా కార్యక్రమంలో చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ లక్ష్మీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం శ్రీ విఘ్నేశ్వరుడి ప్రతిష్ఠతో పాటు నవగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు ఆలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బోగారం మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, నాయకులు రామక్కపేట రవీందర్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వినోద్



కీసర: కీసర మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా చీర వినోద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌ను కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శామీర్‌పేట్: ప్రతీ విద్యార్థి సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని శామీర్‌పేట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ అన్నారు. గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ యాప్స్ ద్వారా ఫోన్‌కు వచ్చే ఫేక్ కాల్స్ మోసాల గూర్చి వివరించారు. కళాశాలల్లో ర్యాగింగ్ నేరమని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపాల్ చేతన, అకాడమిక్ ప్రిన్సిపాల్ ప్రవంతి, ఎస్సై హారిక, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల స్క్రీన్ పరిశీలన



పోచారం: ప్రతాపసింగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంతో పాటు సీసీ కెమెరాల స్క్రీన్‌ను మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల కదలికలను సీసీ కెమెరాల సహాయంతో గమనించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అందని ‘అపెరల్ పార్క్’ ఫలాలు

- నెరవేరని అపెరల్ పార్క్ లక్ష్యం
- గత ప్రభుత్వాలు పట్టించుకోని వైనం
- అన్నీ వసతులు ఉన్నా మూత పడుతున్న పరిశ్రమలు
- పార్క్‌పై దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ పేద ప్రజల ఉపాధి కోసం నాటి ప్రభుత్వం మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లిలో ఏర్పాటు చేసిన ‘అపెరల్ పార్క్’ లక్ష్యం నెరవేరక అబాసుపాలవుతోంది. నియోజకవర్గంలోని పేద మహిళలకు కుట్టుపని ద్వారా ఉపాధి కల్పించడానికి దివంగత సీఎం నందమూరి తారక రామారావు పరిశ్రమలు ఏర్పాటు చేశారు. 1995 జులై 19న మేడ్చల్ మండలంలోని గుండ్లపోచంపల్లిలో అపరెల్ పార్క్‌కు శంకుస్థాపన జరిగింది. 1999 జూన్ 30న నాటి సీఎం నారా చంద్రబాబు నాయుడు పార్క్‌ను ప్రారంభించారు. ప్రధానంగా అపెరల్ పార్క్‌లో కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నాయి. వస్త్ర పరిశ్రమ ఎక్కువగా కర్ణాటకలో ఉండటంతో అక్కడి వ్యాపారులను అపెరల్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా పార్క్‌ను రూపొందించారు. గ్రామానికి చెందిన రైతుల నుంచి 157 ఎకరాల భూమిని సేకరించి మొత్తం 226.36 ఎకరాలలో అపరెల్ పార్క్ ఏర్పాటైంది. ఇందులో 129.87 ఎకరాలలో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా 121 ప్లాట్లను రూపొందించారు. మిగతా 60 ఎకరాలను మరిన్ని పరిశ్రమల కోసం ఖాళీగా వదిలారు. 38 ఎకరాల పార్క్‌లో రోడ్లు, మురికి కాలువలు, ఇతర వసతులతో పాటు కరెంట్ సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా పార్క్ కోసం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేశారు. ఇలా అన్నీ వసతులు ఏర్పాటు చేసినా పార్క్ ద్వారా 30 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నాటి ప్రారంభోత్సవంలో హామీ ఇచ్చారు.



గుండ్లపోచంపల్లిలో అపెరల్ పార్క్

అన్ని వసతులు ఉన్నా పార్క్‌కు రాని పరిశ్రమలు..

పార్క్‌లో సకల సౌకర్యాలు కల్పించినా పాలకులు పరిశ్రమలను రప్పించడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలున్నాయి. 121 పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నా.. పాలకుల ప్రోత్సాహం లేక పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ఉత్సాహం కనబరచడం లేదు. అధికారులు మాత్రం తమ రికార్డుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ప్లాట్లను కేటాయించినట్లు చెబుతున్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్లాట్లు కేటాయించినా పారిశ్రామిక వేత్తల పరిశ్రమల ఏర్పాటు కాగితాలకే పరిమితమైందని పలువురి వాదన.

అడుగులు పడినా..

గత ప్రభుత్వ హయాంలో అడుగులు పడినా ఆతర్వాత వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో అపెరల్ పార్క్ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రత్యేకంగా మరింత స్థలం కేటాయించి పరిశ్రమల కోసం శంకుస్థాపనలు చేసినా ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలకులు పట్టించుకోకపోవడంతో అపరెల్ పార్క్ పెద్దగా అభివృద్ధి చెందలేదు. నూతన ప్రభుత్వం అపెరల్ పార్క్‌పై దృష్టిసారిస్తే మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వెంటనే అభివృద్ధి చేయాలని విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

మూతపడుతున్న పరిశ్రమలు..

అపెరల్ పార్క్ ఏర్పడినప్పటి నుంచి నెల కొన్న ప్రముఖ బ్రాండ్ల వస్త్ర కంపెనీలు క్రమేపీ మూతపడుతున్నాయి. ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు అందకపోవడంతో వ్యాపారవేత్తలు కంపెనీలను మూసి వేస్తున్నారు. ఎంతోమంది మహిళలకు ఉపాధి కేంద్రంగా నిలిచిన అపెరల్ పార్క్‌పై పాలకులు దృష్టి సారించాలని మేడ్చల్ ప్రజలు కోరుతున్నారు.



అపెరల్ పార్క్‌లో మూతపడ్డ ప్రముఖ వస్త్ర కంపెనీ

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



వంటలు పరిశీలిస్తున్న వజ్రేశ్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు మున్సిపాలిటీ అంకుషాపూర్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల జగద్గిరిగుట్ట పాఠశాలను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, బీబ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో కలిసి గురువారం సందర్శించారు. వంట గదిని, ఆహార పదార్థాలు, కూరగాయలు, బియ్యం, తరగతి గదులు పరిశీలించారు. తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు బిగించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. ఈ నేపథ్యంలో వారితో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేష్, మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణముదిరాజ్, పిర్జాదిగూడ డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మశ్చేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, జంగయ్య యాదవ్, నరేష్‌గౌడ్, మాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న పావనీజంగయ్య, నాయకులు

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

బోడుప్పల్: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. గురువారం 12వ డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్యంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యర్థాలను రోడ్లపై వేయకుండా స్వచ్ఛ కార్మికులకు అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్, గౌతమీనగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు దుర్గయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.



ప్రత్యేక పారిశుద్ధ్యంలో కార్పొరేటర్ కల్యాణ్‌కుమార్

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

మల్లాపూర్: ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్వహించే చర్చలో ఆటోడ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య కోరారు. గురువారం ఎమ్మెల్సీ కోదండరాంను ఆటో యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. డిసెంబర్ 7న ఆటోటాక్సీ, వ్యాన్ క్యాబ్‌లు రాష్ట్రవ్యాప్త బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్సీని కోరారు. జేఏసీ యూనియన్ నేతలు వెంకటేష్, ఏఐటీయూసీ సత్తిరెడ్డి, టీఏడీఎస్ ప్రవీణ్, టీయూసీఐ ఎండీ నజీర్, టీఏడీడబ్ల్యూఏ బాలనర్సింహ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హైమద్, సికింద్రాబాద్ ఇన్‌చార్జి రాకేష్, రామాంజనేయులు, కృష్ణమూర్తి తదితరులున్నారు.



ఎమ్మెల్సీ కోదండరాకు వినతిపత్రం ఇస్తున్న ఆటో జేఏసీ యూనియన్ ప్రతినిధులు

పెండింగ్ పనులు పూర్తి చేయండి

కుషాయిగూడ: డివిజన్‌లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులకు సూచించారు. గురువారం ఆమె ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కుషాయిగూడలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సీవరేజ్, సీసీరోడ్లు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని స్థానికులు కోరారు. దీనిపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడిన కార్పొరేటర్ త్వరగా పూర్తయ్యేలా చూస్తానన్నారు. అనంతరం వీఎస్‌రెడ్డినగర్ నాలాలో పూడికతీత పనులను పరిశీలించారు. ఇంజనీరింగ్ డీఈ బాలకృష్ణ, ఏఈ స్వరూప, స్థానిక నేతలు సీతారాంరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్వర్లు, రాజుగౌడ్, గోపాల్‌యాదవ్, హీరాలాల్‌నాయక్, శిరీష, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుందరం ఫైనాన్స్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: జనరల్ ఇన్సూరెన్స్, హౌసింగ్ లోన్‌లకు సంబంధించి అసెట్ మేనేజ్‌మెంట్‌కు పేరొందిన సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ కొంపల్లి, ఘట్‌కేసర్‌లలో రెండు కొత్త శాఖలను ఏర్పాటు చేసింది. ఈ రెండు శాఖలను పలువురు ప్రముఖుల సమక్షంలో కంపెనీ అధికారులు గురువారం ప్రారంభించారు. నగరవాసులకు ఉపయుక్తంగా ఉండేలా కార్లు, చిన్న తేలికపాటి వాణిజ్య వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, మధ్యస్థ భారీ వాణిజ్య వాహనాల కొనుగోలు రుణాల పంపిణీపై కూడా ఈ రెండు శాఖలు దృష్టి సారించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

ఘనంగా ప్రపంచ మృత్తిక దినోత్సవం

కీసర: కీసర, యాద్గరిపల్లి రైతు వేదికలలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో వ్యవసాయ అధికారులు సమావేశం నిర్వహించారు. రకరకాల మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు చేసి, వచ్చిన ఫలితాల ఆధారంగా వేయాల్సిన పంటల గురించి రైతులకు వివరించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి మాధవీలత, విస్తరణాధికారులు వందన, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి



ఘట్‌కేసర్: యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడిగా బొక్కొనిగూడకు చెందిన బొక్క సంజీవరెడ్డి వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఘట్‌కేసర్‌లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు నాయకులు ఆయనను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

క్రీడా పోటీల సన్నాహక సమావేశం



శామీర్‌పేట్: ఈ నెల 10 నుంచి 12వ తేది వరకు హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో జరుగనున్నాయి. ఈ మేరకు గురువారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ స్థాయి అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, యోగా తదితర క్రీడా పోటీలు నిర్వహించబడతాయని, ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు.



మహా పడిపూజలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

అయ్యప్పస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మల్కారంలో పీవీఎం బ్రదర్స్ ఆధ్వర్యంలో గురువారం అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, ప్రసాద్, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు



రోడ్లను శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్ దీపికరెడ్డి, కౌన్సిలర్ దేవరాజు



నవగ్రహ హోమం చేస్తున్న వేద పండితులు

మేడ్చల్: ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు పట్టణంలోని 3వ వార్డులో గురువారం నిర్వహించారు. కౌన్సిలర్ జాకట దేవరాజు నేతృత్వంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి కాలనీలలోని వీధుల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి వీధులను శుభ్రం చేసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కీసరలో..
ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని కీసరగుట్టలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం నవగ్రహ హోమం నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, కార్యనిర్వహణ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో కార్మికుల పాత్ర కీలకం

బోడుప్పల్: నగర పాలకసంస్థను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు పాత్ర కీలకమని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులకు ఆయన చేతి గ్లౌజులు, మాస్కులు, సేఫ్టీ జాకెట్లను పంపిణీ చేశారు. కమిషనర్ రామలింగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, కమలాకర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ వస్తువులను అందజేస్తున్న మేయర్



గ్రంథాలయ భవనాల పరిశీలన

శామీర్‌పేట్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గురువారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరు శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. జిల్లాలోని కీసర, దేవరయాంజాల్, శామీర్‌పేట, అలియాబాద్‌లలో కొనసాగుతున్న గ్రంథాలయ భవనాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతలో లోపాలు లేకుండా చూడాలని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అసిస్టెంట్ ఇంజనీర్‌లకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్‌బాబు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

శామీర్‌పేట్: సైబరాబాద్ కమిషనరేట్, శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం భారీ మొత్తంలో గంజాయిని తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. ఇతర రాష్ట్రాల నుంచి శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోకి భారీ మొత్తంలో గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించి భారీ మొత్తంలో గంజాయితో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో అనుమానం రాకుండా గంజాయిని తరలిస్తున్న ముఠాలో ముగ్గురు మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పై విషయమై శామీర్‌పేట సీఐ శ్రీనాథ్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

వ్యక్తి అదృశ్యం



రక్షిత్ (ఫైల్)

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లి స్కూల్ బస్ క్లీనర్ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్ మర్వాడి లైన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కార్పొరేషన్ మార్వాడి లైన్‌లో కొప్పుల రక్షిత్ (19) ఓ స్కూల్ బస్ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 4న తన ఫోన్ ఇంట్లోనే పెట్టి బయటకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో రక్షిత్ ఆచూకీ కోసం బంధువుల వద్ద, చుట్టు ప్రక్కన ప్రదేశాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

ఘట్‌కేసర్: విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భోగారంకు చెందిన శివకిరణ్ (16) ఘట్‌కేసర్‌లోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ఇంటి నుంచి కాలేజీకి వెళ్తున్నా అని చెప్పి వెళ్లిన శివకిరణ్ మధ్యాహ్నం కాలేజీకి వెళ్లలేదు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు శివకిరణ్ ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.